## ప్రశ్నించే గొంతుక మూగబోయింది

మల్కాజిగిరిలో ఎంపీగా గెలిచి, పీసీసీ, అక్కడి నుంచి సీఎం సీటులో కూర్చున్న రేవంత్, ఇక్కడి ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కనీసం ప్రశ్నించే గొంతుకలా ఉంటానని కేంద్రం నుంచి రూపాయి తీసుకురా లేదన్నారు. అరచేతిలో స్వర్గం చూపి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి అబద్ధాలను జనాల్లోకి తీసుకుపోవాలన్నారు. ఇంట్లో ఇద్దరికి పెన్షన్ ఇస్తానని గెలిచిన రేవంత్ రెడ్డి జనవరి నెలలో 46 లక్షల మందికీ పెన్షన్ ఎగగొట్టాడన్నారు. రేవంత్ చెప్పినట్లుగా రుణమాఫీ కాలేదు, పెన్షన్ పెరగలేదు, ఆడపిల్లలకు స్కూటీ రాలేదనే విషయాలన్ని ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు.

### పేదల నడ్డి విరిచిన మోదీ

తెలంగాణకు మోదీ చేసిందేమిటో, బీజేపికి ఎందుకు ఓటు వేయాలంటే చెప్పలేని స్థాయిలో ఇక్కడి నేతలు ఉన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచింది మోదీ సర్కారేనని, గ్యాస్ నుంచి మొదలుకుంటే ఉప్పు వరకు అన్ని ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. దిగుమతి చేసుకునే క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా, దేశంలో మాత్రం పెట్రోలు, డీజిల్ ధరలు ఏమాత్రం తగ్గవని ఎద్దేవా చేశారు. 2014లో బ్యారెల్ ధర 100 డాలర్లు ఉంటే, 2024లో 84 డాలర్లుగా ఉన్నా కూడా పెట్రోల్, డీజిల్ ధరలు మాత్రం వందకు తగ్గేది లేదన్నారు.

### బీఆర్ఎస్ గెలుపుతోనే అధికారం సొంతం

సోషల్ మీడియాలో ఉన్న వారంతా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఎండగట్టాలి. 13 ఎంపీ సీట్లను గెలిస్తే ఏడాది కాలంలో రాష్ట్ర రాజకీయాలను బీఆర్ఎస్ శాసిస్తోందన్నారు. గడిచిన 10ఏళ్లలో మోదీ చెప్పినా ఏ ఒక్కటి కూడా అమలు కాలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి బీజేపీకి కోసం పని చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ముఖ్యమంత్రి అయిన సీఎం రేవంత్ రెడ్డి... బీజేపీకి ఓటు వేయమని ప్రచారం చేసిన విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. బీజేపీ,కాంగ్రెస్ పార్టీలను ఎప్పటికైనా బీఆర్ఎస్ నిలువరిస్తుందన్నారు. గతంలోనూ బీజేపీ తీస్మార్ ఖాన్‌లను ఓడగొట్టిన బీఆర్ఎస్ ఆ పార్టీలతో ఎందుకు లాలూచీ పడుతుందనే విషయాన్ని ప్రజలు గుర్తు పెట్టుకోవాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా బీఆర్ఎస్-బీజేపీ ఒకటేనని చేసిన తప్పుడు ప్రచారంతో కాంగ్రెస్ పార్టీ గెలిచిందని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. కంటోన్మెంట్‌ను నివేదితను గెలిపించాలి. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి.



బీఆర్ఎస్ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, చిత్రంలో ఎమ్మెల్యేలు, పోటీ చేస్తున్న అభ్యర్థులు

# కాంగ్రెస్, బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి

## ఆ పార్టీలు గెలిస్తే హైదరాబాద్ కేంద్రపాలిత ప్రాంతమే

### కుమ్మక్కు రాజకీయాలకు చెక్ పెట్టాలి

### బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్‌తో కేటీఆర్ సమావేశం

### మల్కాజిగిరిలో ఉత్సాహవంతంగా సాగిన ప్రసంగం



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్ చిత్రంలో కంటోన్మెంట్ అభ్యర్థి నివేదిత

సిటీబ్యూరో, ఏప్రిల్ 29(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌పై కాంగ్రెస్, బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. మల్కాజిగిరి పార్లమెంటరీ సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో సోమవారం ఆయన పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలలో ఏదీ గెలిచినా, హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేసే ప్రమాదం ఉన్నదన్నారు. జూన్-2తో ఉమ్మడి రాజధాని ఒప్పందం ముగియనుందని, వచ్చే పార్లమెంటరీ ఎన్నికల తర్వాత ఆ పార్టీల అభ్యర్థులు గెలిస్తే హైదరాబాద్ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంచుకునే కుట్రలను జనాలకు తెలియజేయాలన్నారు. అదే గనుక జరిగితే ఇన్నాళ్లు హైదరాబాద్ కేంద్రంగా జరిగిన అభివృద్ధి, స్థానికంగా ఉండే అధికారాలన్నీ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి పోతాయన్నారు. వచ్చే పార్లమెంటరీ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే దేశంలో రాజ్యాంగమే ఉండదని, మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు రద్దయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇక నదుల అనుసంధానం పేరిట తెలంగాణ ప్రయోజనాలకు గండికొట్టేలా ప్రధాని మోదీ వ్యవహరిస్తున్నారని, ఇక్కడి అవసరాలు తీరకుండానే, ఇక్కడి ప్రాజెక్టులు పూర్తి కాకుండానే గోదావరి జలాలను కావేరి నదిలోకి తరలించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్, బీఆర్ఎస్‌పై ఉన్న వ్యతిరేకతతోనే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిందని, ఇప్పుడు కాంగ్రెస్ ఓట్లను బీజేపీ మళ్లించేలా సీఎం రేవంత్ రెడ్డి బీజేపీతో చీకటి ఒప్పందం చేసుకున్నారని మండిపడ్డారు. అందుకే, బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్న ఈటల రాజేందర్‌పై ఓ డమ్మీ క్యాండెట్‌ను బలవంతంగా నిలబెట్టి ఆమెను బలి పశువు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ ఒకటేనని చెప్పడానికి ఎన్నో సాక్ష్యాలు ఉన్నాయన్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఓసారి గమనించాలన్నారు. కరీంనగర్‌లో బండి సంజయ్ మాట్లాడుతూ, ''కాంగ్రెస్, బీజేపీ కొట్లాడుకోవడం కాదు, అక్కడక్కడ ఉన్న బీఆర్ఎస్ పార్టీని బొందపెట్టాలి'' అనే వ్యాఖ్యలను అర్థం చేసుకోవాలన్నారు. అదే విధంగా నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ కూడా రేవంత్ రెడ్డికి బీజేపీతో ఉన్న అనుబంధాన్ని బట్టబయలు చేశారని, పార్లమెంట్ ఎన్నికల తర్వాత సీఎం స్వయంగా బీజేపీలో చేరుతారని కుండ బద్ధలు కొట్టిన విషయాన్ని మరిచిపోవద్దన్నారు. ఈ క్రమంలో పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను నిలువరించే కుట్రలను, ఆ రెండు పార్టీల బాగోతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా సోషల్ మీడియా వారియర్ కృషి చేయాలన్నారు. ముస్లిం ఓట్లను మళ్లించుకోవడం కోసమే బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనని దుష్ప్రచారం చేసి కాంగ్రెస్ గెలిచిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత సీఎం రేవంత్ రెడ్డియే బీజేపీలో చేరుతారంటూ చెబుతున్న మాటలను జనాలకు అర్థమయ్యేలా చెప్పాల్సిన బాధ్యత బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లనే బీజేపీకి మళ్లించే ప్రయత్నం జరుగుతున్నది. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోకవర్గాల పరిధిలో గత ఎన్నికల్లో ఇదే జరిగిందన్నారు. బీజేపీ నేతలపై పోటీ చేసిన మధు యాష్కి, పొన్నం ప్రభాకర్ లాంటి బలమైన నేతలు పార్లమెంటరీ ఎన్నికల్లో ఓడిపోతే, ఆ తర్వాత వచ్చిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచిన విషయం మరిచిపోవద్దన్నారు. కేసీఆర్‌పై ఆ పార్టీలకు ఉన్న కోపమే... ఆ రెండు పార్టీలు కలిసి పనిచేసేలా చేస్తున్నాయని, ఇలాంటి కుమ్మక్కు రాజకీయాలను తిప్పికొట్టి బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు.

### పదేళ్ల అభివృద్ధి పథంలో పలు రంగాలు..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఈ పదేళ్లు, కేసీఆర్ హయాంలో ఎన్నో రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోయిన విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో బీఆర్ఎస్‌పై జరిగిన దాడితో 1.8 శాతం ఓట్లతో గత ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయాం. అప్పుడు జరిగిన తప్పిదాలను పునరావృతం కాకుండా ప్రతి పోలింగ్ బూత్ వరకు ఓటర్లను తీసుకువచ్చి పార్టీకి ఓట్లు పడేలా సోషల్ మీడియా వారియర్లు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో వేసే ప్రతి ఓటు బీఆర్ఎస్ గెలుపునకు ఎంతో కీలకమని, అతి స్వల్ప ఓట్లతో అసెంబ్లీలో సీట్లను కోల్పోయిన విషయాన్ని ప్రతి ఒక్క కార్యకర్త గుర్తు పెట్టుకోవాలన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో, కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఓటింగ్ శాతాన్ని పెంచేలా విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు బీఆర్ఎస్ గెలిచేలా కృషి చేయాలన్నారు. దేశంలోనే ఏ పార్టీకి రానంత గుర్తింపు మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్‌కు వచ్చిందన్నారు. నియోజకవర్గంలో ఉన్న 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ గెలిచిందన్నారు. 3 లక్షల 55 వేల ఓట్ల అధిక్యాన్ని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో వచ్చిందని, వచ్చే ఎన్నికల్లోనూ ఇదే తీరుగా భారీ మెజార్టీతో మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి, ఈటెల రాజేందర్‌ల మధ్య ఉన్న చీకటి ఒప్పందం ప్రకారమే మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీ డమ్మీ క్యాండెట్‌ను బరిలో దించిందన్నారు. చేవెళ్ల టికెట్ అడిగిన అభ్యర్థికి బలవంతంగా మల్కాజిగిరి నుంచి పోటీలోకి ఉంచి బలి పశువును చేసేలా ఆ రెండు పార్టీలు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ఓట్లను బీజేపీకి మళ్లించాలనే కుట్ర జరుగుతుందనే దానికి ఎన్నో సాక్ష్యాలు ఉన్నాయన్నారు.

### తెలంగాణకు మోదీ చేసిందేమీ లేదు

తెలంగాణకు ప్రధాని మోదీ చేసిందేమీ లేదని, మెడికల్ కాలేజీలు, ఐటీఐఆర్ ప్రాజెక్టు, కాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ కూడా ఇవ్వలేదన్నారు. కనీసం పెద్దరికం కోసం చేపట్టిన నారాపల్లి-రామంతాపూర్ స్కైవే పనులు పూర్తి చేయలేకపోయిందన్నారు. ఇక బీజేపీ గెలిస్తే ఏం చేస్తారో చెప్పలేరు. ఎందుకు మోదీకి ఓటేయాలో కూడా చెప్పలేని పరిస్థితిలో ఆ పార్టీ నేతలు ఉన్నారని మండిపడ్డారు. సికింద్రాబాద్ నుంచి గెలిచిన కిషన్ రెడ్డి చెప్పే అబద్ధాలను నమ్మి మోసపోవొద్దన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే యాదాద్రి దివ్య మందిరాన్ని నిర్మించుకున్నామని, శ్రీరాముడు ఆ ఒక్క పార్టీకి చెందిన దేవుడు కాదనీ, భవ్య రామ మందిర నిర్మాణంలో ప్రతి ఒక్క హిందువు తోచిన విధంగా సాయం చేసిన విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. కానీ శ్రీరాముడు ఆ పార్టీకి మాత్రమే సొంతమైనట్లుగా బీజేపీ నేతలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. నదుల అనుసంధానం, రాజ్యాంగం రద్దు, 2026లో లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల డిలిమిటేషన్ పేరిట దక్షిణాది రాష్ట్రాలకు పెద్ద ప్రమాదమే పొంచి ఉందన్నారు. 2026లో వచ్చే డిలిమిటేషన్ ద్వారా దక్షిణాది గొంతును నలిపివేసే ప్రమాదం ఉందనీ, బీజేపీ బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో పార్లమెంట్ స్థానాలను తగ్గించే అవకాశం కూడా ఉందన్నారు. ఇలాంటి కుట్రలను నిలువరించాలంటే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఓడించి బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. ఇక కొడంగల్‌లో ఓడిన రేవంత్ రెడ్డి, ప్రశ్నించే గొంతుక అంటూ మల్కాజిగిరిలో ఎంపీగా గెలిచిన ఆయన, కనీసం పార్లమెంట్‌లో తెలంగాణ కోసం ప్రశ్నించలేదన్నారు. బీఆర్ఎస్ కండువా కప్పుకున్న రాగిడి లక్ష్మారెడ్డి గెలిస్తేనే కేంద్రంలో జరిగే కుట్రలను తిప్పి కొట్టగలుగుతారని స్పష్టం చేశారు.

# ఓటు హక్కు.. ఆయుధం

### ప్రతి ఒక్కరు బాధ్యతగా వినియోగించుకోవాలి

### మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్లు

ఖైరతాబాద్, ఏప్రిల్ 29: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓటు హక్కు అనే ఆయుధాన్ని ప్రజలకు అందించారని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సమాచార హక్కు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 'సమాచార హక్కు చట్టం-ప్రస్తుత పరిస్థితులు-భవిష్యత్ కార్యాచరణ-ఓటరు చైతన్యం, సీ విజిల్ యాప్'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందుకు ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, భారత దేశం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమని, రాజ్యాంగం ఇక్కడ పుట్టిన ప్రతి ఒక్కరికి కుల, మత భేదం లేకుండా స్వేచ్ఛ, హక్కులు కల్పించిందన్నారు. అందులో ఓటు హక్కు కీలకమైందని, దేశ భవితను తీర్చిదిద్దేందుకు అది దోహదపడుతుందన్నారు. యువత తమ కుటుంబ సభ్యులతో పాటు తమ చుట్టూ ఉన్న సమాజానికి ఓటు విలువ తెలియజేయాలన్నారు. డబ్బు, మద్యానికి తమ ఓటును అమ్ముకుంటే ఐదేండ్ల పాటు కష్టాలు పడాల్సి వస్తుందన్నారు. సమాజానికి మేలు చేసే వారిని గుర్తించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జల సాధన సమితి జాతీయ అధ్యక్షులు డి.సత్యనారాయణ, సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు, రాష్ట్ర కన్వీనర్ కన్నెబోయిన ఉషారాణి, పంచాయతీరాజ్ మాజీ చీఫ్ ఇంజినీర్ ఎంఏ కరీం, సమితి నగర అధ్యక్షుడు ఎస్డీ లూకమాన్ అలీ, హెచ్ఆర్సీ అధ్యక్షులు సామ రామ్మోహన్, కార్యదర్శి శంకర్ రాథోడ్, సామాజిక కార్యకర్త వీవీ రావు, ఎన్ఎస్ఎస్ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి రామకృష్ణ పాల్గొన్నారు.

# కుల సంఘంగా.. రాష్ట్ర కాంగ్రెస్

### ఇతర సామాజికవర్గాలను ఓట్లడిగే హక్కు సీఎంకు లేదు

### లోక్‌సభలో గిరిజనుల ఓట్లు బీఆర్ఎస్‌కే

### సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆంగోతు రాంబాబు నాయక్



అభివాదం చేస్తున్న సేవాలాల్ సేన నాయకులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 29: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి కుల సంఘంగా మారిపోయిందని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆంగోతు రాంబాబు నాయక్ ఆరోపించారు. ఇతర సామాజికవర్గాల ఓట్లడిగే హక్కు ముఖ్యమంత్రికి లేదన్నారు. అత్యధికంగా జనాభా కలిగిన బంజారా ప్రజలను కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆంగోతు రాంబాబు నాయక్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఏర్పడిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో గిరిజనులకు ఎంతో మేలు జరిగిందని, ఆకాంక్షలు నెరవేరాయని చెప్పారు. 500 జనాభా కలిగిన గిరిజన తండాలు, గూడాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారని, గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇచ్చి, రైతు బంధు మంజూరు చేసి ఆదుకున్నారన్నారు. ఫిబ్రవరి 15న సేవాలాల్ మహరాజ్ జయంతిని గుర్తించి, ప్రభుత్వ నిధులతో అధికారికంగా నిర్వహించి గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడారన్నారు. రాష్ట్ర విభజనతో ఏపీలో విలీనమైన ముంపు మండలాల ఉద్యోగులను తిరిగి తెలంగాణ రాష్ట్రంలో తీసుకున్నారని, ఆత్మగౌరవ భవనం (సేవాలాల్ బంజార భవన్) నిర్మించారని, రెండు దఫాలుగా ఏర్పడ్డ బీఆర్ఎస్ ప్రభుత్వంలో బంజారా జనాభాను గుర్తించి, ఎమ్మెల్సీ, మంత్రి పదవులు ఇవ్వడంతో పాటు నామినేటెడ్ పదవుల్లో సముచితమైన స్థానం కల్పించారన్నారు. ఇలా గిరిజనుల ఆత్మగౌరవాన్ని నిలుపడంతో పాటు సంక్షేమ పథకాలను అమలు చేసినందుకు మాజీ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా, తెలంగాణ అన్ని రంగాల్లో సంపూర్ణమైన అభివృద్ధి చెందాలన్నా అది బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. సమావేశంలో సేవాలాల్ సేన రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు రఘురాం రాథోడ్, ఉపాధ్యక్షులు వడ్త్యా రేఖ్యా నాయక్, భీమ్‌లాల్ పవార్, పరశురాం నాయక్, సేవాలాల్ యువ సేన రాష్ట్ర అధ్యక్షులు మోహన్ నాయక్, సోషల్ మీడియా ఇన్‌చార్జి మోతిలాల్ నాయక్, గ్రేటర్ నాయకులు బాల్‌సింగ్ నాయక్ పాల్గొన్నారు.

### తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం..

# ఈఎస్ఐ రాష్ట్ర నూతన కమిటీ



ఎన్నికైన ఈఎస్ఐ వైద్యుల కార్యవర్గం

ఉప్పల్, ఏప్రిల్ 29: రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ ఆధ్వర్యంలో రిటర్నింగ్ ఆఫీసర్ నిర్వహణలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం ఈఎస్ఐ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా డా.చీమ శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ డా.ఎన్. సతీష్ కుమార్, కోశాధికారి డా. సీహెచ్ నాగరాజు, గౌరవ అధ్యక్షులు డా. పి.రమేష్, ఉపాధ్యక్షులు డా.వెంకట్‌రెడ్డి, డా. దుర్గా పద్మజ, డా.విజయ్ కుమార్, జీసీ మెంబర్స్‌గా డా.శైలజ, డా.లక్ష్మీకాంత్, డా.రాజన్న, జాయింట్ సెక్రటరీలుగా డా.ఖాజా మెయినుద్దీన్, డా.పెంటా గౌడ్, ఈసీ సభ్యులు డా.రాజేంద్ర ప్రసాద్, డా.బ్రిజ్ మెహన్, డా.శ్రావణ రత్నం, డా.నరేంద్రలు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డా. చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈఎస్ఐపై చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు. కార్మికులకు న్యాయం చేసేవరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.


## మే 23 నుంచి మౌంట్ అబూలో సమాజ పరిణతిపై సదస్సు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న సరళా తదితరులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 29: ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, మీడియా విభాగం, రాజయోగ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మే 23 నుంచి 27 వరకు రాజస్థాన్‌లోని మౌంట్ అబూలో 'సమాజ పరిణతిలో దృష్టి మరియు విలువలు - మీడియా పాత్ర( విజన్ అండ్ వాల్యూస్ ఫర్ ఏ న్యూ సోషల్ ఆర్డర్ - రోల్ ఆఫ్ మీడియా)' అనే అంశంపై జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు బ్రహ్మ కుమారిస్ మీడియా విభాగం జాతీయ కో ఆర్డినేటర్ బీకే సరళ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె ఆహ్వాన పత్రికలను విశాల, పార్వతితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా మీడియా అధిపతులు, ఎడిటర్లు, బ్యూరో చీఫ్, సీనియర్ కరస్పాండెంట్లు, సీఈవో, డైరెక్టర్లు, ప్రోగ్రాం ప్రొడ్యూసర్లు ఈ సదస్సుకు హాజరవుతున్నారని తెలిపారు. ఆయా అంశాలపై వక్తలు ప్రసంగిస్తారని, అనేక సూచనలు చేస్తారని తెలిపారు. ఈ సదస్సుకు మీడియా తదితర రంగాలకు చెందిన ప్రతి ఒక్కరు హాజరు కావాలని కోరారు.

## ఘనంగా బాబూజీ మహరాజ్ జయంతి



సిటీబ్యూరో, ఏప్రిల్ 29(నమస్తే తెలంగాణ): నగర శివారులోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన కన్హా శాంతి వనంలో బాబూజీ మహరాజ్ 125 జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకలకు అతిథులుగా మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, భారత మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణలు హాజరయ్యారు. బాబూజీ మహరాజ్ జయంతి నేపథ్యంలో కన్హా శాంతి వనంలో ఎనిమిది రోజుల పాటు నిర్వహించే బందార కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్‌నాథ్ కోవింద్ మాట్లాడుతూ, బాబూజీ మహరాజ్‌లోని కరుణ, వినయం, సమదృష్టి వంటి లక్షణాలను అలవర్చుకోవడానికి ప్రతి ఒక్కరు ప్రయత్నించాలన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై రాసిన పుస్తకాలను మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, భారత మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణలు ఆవిష్కరించారు.




టెడ్ ఎక్స్ కార్యక్రమంలో ప్రతినిధులు, విద్యార్థులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

# సరైన ప్రణాళికతో కృషి సఫలీకృతం

### టెడెక్స్ ప్రారంభోత్సవ సభలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

శామీర్‌పేట, ఏప్రిల్ 29: సరైన ప్రణాళిక ఏర్పాటు చేసుకుని క్రమశిక్షణతో కృషి చేస్తే సఫలత సాధ్యమవుతుందని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల మెయిన్ క్యాంపస్‌లో సోమవారం టెడ్ ఎక్స్ ప్రారంభోత్సవ సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని విజయం సాధించాలన్నారు. సాధారణ జీవన శైలికి అసాధారణ ఆలోచనా విధానాన్ని మేళవించాలన్నారు. మార్కెట్‌లో ఒక మంచి వాణిజ్య అవకాశంగా మలచుకోవాలన్నారు. విద్యార్థులు తమ జీవితంలో అతి తక్కువ కాలంలో ఆర్థిక స్వాతంత్రం పొందాలన్నారు. తమ చర్యల ద్వారా తమ నిర్ణయాల ద్వారా పది మందికి సహాయపడుతూ సమాజంలో ప్రతి సంవత్సరం తమ విలువ పెంచుకునేలా విద్యార్థులు అడుగులు ముందుకు వేయాలని హితువు పలికారు. విద్యార్థులు తమ లక్ష్య సాధనకు ఎంచుకునే మార్గం విషయంలో అవసరమైన వనరుల విషయంలో ఉపయోగపడే మార్గదర్శకుడి విషయంలో ఒక స్పష్టత కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రామస్వామి రెడ్డి, అజయ్ హనుమంతు, రాజా నరేన్, భార్గవి, నవీన్ చారి, సతీశ్ వర్మ, నేత్రారెడ్డి, అధ్యాపక సమన్వయకర్తలు డాక్టర్ బీకే రాజ్యలక్ష్మి, డాక్టర్ శివప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశంలో పదేళ్లుగా మోదీ విధ్వంసకర పాలన

### క్రిస్టియన్ డెమోక్రటిక్ మూమెంట్ ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మెల్కీ సెదెక్, ఉపాధ్యక్షులు, టీసీ క్రిష్టఫర్, తదితరులు

మారేడ్‌పల్లి, ఏప్రిల్ 29: దేశంలో గత పదేళ్లుగా మోదీ ప్రభుత్వం విధ్వంసకరమైన పాలన కొనసాగుతుందని క్రిస్టియన్ డెమోక్రటిక్ మూమెంట్ (క్రైస్తవ ప్రజాస్వామ్య ఉద్యమం) సంస్థ ఆరోపించింది. రెజిమెంటల్ బజార్‌లోని సంస్థ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మెల్కీసెదెక్, ఉపాధ్యక్షులు టీసీ క్రిష్టఫర్, ఎస్సీ, ఎస్టీ బీసీ, ముస్లిం ఫ్రంట్ చైర్మన్ సనావుల్లా ఖాన్, మైనార్టీ జేఏసీ కో కన్వీనర్ తన్వీర్ మాట్లాడారు. కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రజాస్వామ్య, సెక్యూలర్ భావాలను తుంగలో తొక్కి రాజ్యాంగం యొక్క మూల స్వరూపాన్ని పూర్తిగా మార్చి వేసే కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్ మత ఘర్షణలో వేల మంది చనిపోయారని, దేశానికి వెన్నెముక అయిన రైతులను ఆదుకోవాల్సింది పోయి వారి ఉద్యమాలను అణచివేసేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నించిందని విమర్శించారు. మోదీ దేశాన్ని మతం ప్రాతిపదికన విడగొట్టి ప్రజల మధ్య విభేదాలను తీసుకొస్తున్నారని, అభివృద్ధిని విస్మరించి గత ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన అనేక ప్రభుత్వ రంగ సంస్థలను తమ వాళ్లకు అప్పనంగా అప్పగిస్తున్నారని విమర్శించారు. నోట్ల రద్దుతో రూపాయి విలువ పడిపోందని, దేశంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని వారు చెప్పారు. ఈ కేంద్ర ప్రభుత్వ విధానాలతో దేశంలో ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీ వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందని, అందుకే రాబోయే ఎన్నికల్లో ప్రజాస్వామిక వాదులు, మేధావులు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఇండియా కూటమికి మద్దతు ఇవ్వాలని కోరుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డాక్టర్ అబ్రహం, జాన్, అరుణ్ కుమార్, హంస వేణి పాల్గొన్నారు.

## తెలంగాణ భవన్‌లో మేడే ఉత్సవాలు



మాట్లాడుతున్న బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య.

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 29: భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో 'మే డే' ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య తెలిపారు. ప్రపంచ కార్మిక దినోత్సవం పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న ఈ వేడుకలలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ముఖ్య అతిథిగా హాజరై కార్మికుల సమస్యలపై మాట్లాడతారన్నారు. ప్రస్తుత, సమాజంలో అత్యంత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఆటోరంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆయా రంగాల కార్మికులంతా అత్యధిక సంఖ్యలో హాజరై కార్మిక దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో స్కూల్ వ్యాన్ సంఘం అధ్యక్షులు డి.శ్రీనివాస్, ఆటో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శాతం రమేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు పోలే నిరంజన్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు హైమద్, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.